వన్యప్రాణులను సంరక్షించాలి

ర్యాలీ నిర్వహిస్తున్న అటవీశాఖ అధికారులు

పినపాక, జూలై 29: వన్యప్రాణులను సంరక్షించి, పర్యావరణ సమతుల్యతను కాపాడటం ప్రతీ ఒక్కరూ బాధ్యతగా అలవాటు చేసుకోవాలని ఏడూళ్ల బయ్యారం రేంజ్ అటవీశాఖ ఎఫ్ఆర్‌వో బీ ద్వాలియా అన్నారు. సోమవారం అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా అవగాహన పినపాకలో ర్యాలీ నిర్వహించారు. వన్యప్రాణులను వేటాడినా, బంధించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఆర్‌వో వెంకటేశ్వరరావు, సీహెచ్ అరుణ, సెక్షన్ అధికారులు, బీట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తిని ఢీకొట్టిన బైక్.. తీవ్ర గాయాలు

ఇల్లెందు రూరల్, జూలై 29: వ్యక్తిని బైక్ ఢీకొట్టిన ఘటన పట్టణంలో సోమవారం చోటు చేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జగదాంబసెంటర్‌లోని ఫొటోగ్రాఫర్ ప్రవీణ్‌కుమార్ దుకాణాన్ని మూసివేసి యూటర్న్ తీసుకుంటున్న క్రమంలో వెనుక నుంచి ద్విచక్ర వాహనంపై వస్తున్న వ్యక్తి ఢీకొట్టాడు. దీంతో ప్రవీణ్‌కుమార్ బైక్‌తో సహా కిందపడిపోవడంతో తుంటి ఎముకకు తీవ్రగాయాలు అయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఖమ్మం ఆసుపత్రికి తీసుకెళ్ళాలని సూచించారు. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కరకట్ట నిర్మాణానికి రూ.3వేల కోట్లు కేటాయించాలి
మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్

భద్రాచలం, జూలై 29: గోదావరి పరివాహక ప్రాంతం, తెలంగాణలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన భద్రాచలంలో 25 కిలోమీటర్ల మేర కరకట్ట నిర్మించేందుకు రూ. 3వేల కోట్లు కేటాయించాలని మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్ సోమవారం పార్లమెంట్‌లో మాట్లాడారు. భద్రాచలం పట్టణ ప్రజలకు, ఆదివాసీలకు వరదల వల్ల ఎటువంటి నష్టం జరుగకుండా చూడాలన్నారు.

1న తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నాలు

భద్రాచలం, జూలై 29: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన వాగ్దాలన్నింటిని వెంటనే అమలు చేయాలని ఆగస్టు 1వ తేదీన జిల్లాలోని అన్ని తహసీల్దార్ల కార్యాలయాల ఎదుట, 8న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నాలు చేపట్టనున్నట్లు సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ రాష్ట్ర నాయకుడు కెచ్చెల రంగారెడ్డి తెలిపారు. సోమవారం పట్టణంలోని అశోక్‌నగర్ కాలనీలోని పార్టీ కార్యాలయంలో నిరసనలకు సంబంధించి పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. కల్పన, చరణ్, శివ, సాయన్న, మహేశ్వరీ, దుర్గా భవాని, రవికుమార్ పాల్గొన్నారు.

డీవైసీఎంవోకు సన్మానం

ఇల్లెందు రూరల్, జూలై 29: ఇల్లెందు ఏరియా ఆసుపత్రి నూతన డీవైసీఎంవోగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ నర్సింహారావును ఏఐటీయూసీ నాయకులు నజీర్ అహ్మద్, ఉపాధ్యక్షుడు దాసరి రాజారామ్ సోమవారం కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువా కప్పి సన్మానించారు.

ఆపదలో గేదె.. ఆదుకున్న యువకులు

గేదెను బయటకు తీస్తున్న యువకులు

రామవరం, జూలై 29: ఆపదలో చిక్కుకున్న గేదెను ఏడుగురు యువకులు కలిసి కాపాడారు. స్థానిక ఎస్ఆర్‌టీ ఏరియాలోని ఓ గుంతలో ఓ గేదె పడిపోయి ఉండడాన్ని స్థానిక యువకులు గమనించారు. బయటకు రాలేని ఆ మూగ జీవి యాతనను చూసి చలించారు. వారు ఓ ట్రాక్టర్ సాయంతో దానిని అతి కష్టంగా బయటకు తీసుకొచ్చారు. అది నడవలేని స్థితిలో ఉండడాన్ని చూసి, పశు వైద్యులకు సమాచారమిచ్చారు.ఆ యువకులైన రవితేజ, సాయిబాబా, అల్లి విజయరాజు, బోనగిరి శ్రీకాంత్, అనిల్, జాఫర్, సంజీవ్‌ను స్థానికులు అభినందించారు.

రేపు 'చలో హైదరాబాద్'

కొత్తగూడెం అర్బన్, జూలై 29: సెంట్రలైజ్డ్ కిచెన్ విధానం అమలు చేయవద్దని, వంట కార్మికుల పొట్టలు కొట్టవద్దని కోరుతూ ఈ నెల 31న 'చలో హైదరాబాద్' నిర్వహించనున్నట్లు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్ చెప్పారు. ఆయన సోమవారం సమావేశంలో మాట్లాడుతూ... సెంట్రలైజ్డ్ కిచెన్ విధానంతో రాష్ట్రంలోని 5,400 పాఠశాలల్లోని వంట కార్మికులు ఉపాధి కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. దీనికి వ్యతిరేకంగా 31న 'చలో హైదరాబాద్' నిర్వహించనున్నట్లు చెప్పారు. దీనిని కార్మికులు జయప్రదం చేయాలని కోరారు.

'బ్యాటరీ' దొంగలొస్తున్నారు..!

జామాయిల్ తోటలో ఉన్న జేసీబీ

అశ్వారావుపేట రూరల్, జూలై 29: ఇళ్లల్లోకి చొరబడే దొంగలను చూశాం. బెదిరించి దోచుకునే దొంగలను చూశాం. కానీ, ఇప్పుడు కొత్తగా 'బ్యాటరీ' దొంగలు బయల్దేరారు. మండలంలోని తిరుమలకుంట, పాకలగూడెం గ్రామాల్లో బ్యాటరీలను దొంగిలించారు. తిరుమలకుంట గ్రామంలోని సాధు శ్రీను జామాయిల్ తోటలో మొద్దులు తీసేందుకు జేసీబీ వచ్చింది. దానిని సోమవారం ఉదయం డ్రైవర్ స్టార్ట్ చేయబోతే కాలేదు. ఏమైందోనని పరిశీలించగా.. 200 లీటర్ల డీజిల్, రూ.15వేల విలువైన బ్యాటరీ కనిపించలేదు. తిరుమలకుంట గ్రామస్తుడు జుజ్జూరి ప్రసాద్‌కు చెందిన ట్రాక్టర్‌లోని బ్యాక్టరీ, గ్రామ పంచాయతీ ట్రాక్టర్ పంపుతోపాటు బ్యాటరీ, నల్లపు దుర్గారావుకు చెందిన ట్రాక్టర్‌లోని బ్యాటరీ, ఇదే గ్రామంలోని సాయిబాబాకు చెందిన బ్లేడ్ ట్రాక్టర్‌లోని బ్యాటరీని దొంగలు మాయం చేశారు. బ్లేడ్ ట్రాక్టర్‌లోని బ్యాటరీని దొంగలు తీసుకెళ్తుండగా సాయిబాబా కుటుంబీకులు గమనించి వెంటబడ్డారు. ఆ బ్యాటరీని దొంగలు వదిలేసి పారిపోయారు. వాహనాల్లోని బ్యాటరీలను, అప్పుడప్పుడూ డీజిల్‌ను చోరీ చేస్తున్న ఈ సరికొత్త దొంగలను పట్టుకోవాలని బాధితులు, వీరి (దొంగల) బెడద తప్పించాలని మండల ప్రజలు.. పోలీస్ అధికారులను వేడుకుంటున్నారు.

వాహనాల తనిఖీ

ఇల్లెందు రూరల్, జూలై 29: పట్టణంలోని గోవింద్‌సెంటర్లో సోమవారం పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. సీఐ సత్యనారాయణ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పట్టణంలో సోదాలు, తనిఖీలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ఎస్సై, కానిస్టేబుళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

రైతుల ప్ర'దక్షిణ'..!

పనిచేయని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద రైతులు

చంద్రుగొండ, జూలై 29: గుడి చుట్టూ భక్తులు ప్రదక్షిణ చేసినట్లుగా.. ఆ రైతులు కూడా విద్యుత్ సబ్ స్టేషన్ చుట్టూ తిరుగుతున్నారు. గుడిలోని పూజారికి భక్తులు దక్షిణ చెల్లించినట్లుగా..విద్యుత్ అధికారులకు/సిబ్బందికి దక్షిణ (లంచం) చెల్లించారు. అయినప్పటికీ తమను పట్టించుకోవడం లేదంటూ ఆ రైతులు మండిపడుతున్నారు. చంద్రుగొండలో ఓ ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. దాని పరిధిలో 15 మంది రైతుల సాగు భూములు, వాటికి విద్యుత్ మోటర్లు ఉన్నాయి. దాదాపు 20 రోజుల కిందట ఈ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చెడిపోయింది. మరమ్మతులు చేయాలంటూ ఆ రైతులు రోజూ సబ్ స్టేషన్ చుట్టూ ప్రదక్షిణ చేస్తూనే ఉన్నారు. సంబంధిత అధికారి, సిబ్బంది 'ఖర్చుల' కింద మొత్తం రూ.7,000 లను 'దక్షిణ'గా సమర్పించుకున్నారు. అయినప్పటికీ ఫలితం కన్పించడం లేదని బాధిత రైతులు గంగారపు సత్యనారాయణ, అజ్జర్, మూర్తుజ, బోగి అప్పారావు, కోటయ్య, రామిశెట్టి వెంకటేశ్వర్లు, బోగి సైదయ్య, నాగేశ్వరరావు, తదితరులు ఆవేదన-ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు స్పందించాలని వేడుకుంటున్నారు.

ఒకరు బావిలోదూకి..
మరొకరు చెట్టుకి ఉరి..
విషాదంలో పగిడేరు గ్రామం

వృద్ధ దంపతుల బలవన్మరణం

రామచంద్రయ్య, సరోజినమ్మ(ఫైల్)

నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రేగా

మణుగూరు టౌన్, జూలై 29: మండలంలోని పగిడేరు గ్రామంలో వృద్ధ దంపతులు బలవన్మరణానికి పాల్పడ్డారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాసరబాద రామచంద్రయ్య (80), భార్య సరోజినమ్మ (75) బీజీ కొత్తూరు ఎస్టీ కాలనీలో నివాసం ఉంటున్నారు. వీరికి ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. వృద్ధ దంపతులు పిల్లల దగ్గర ఉండకుండా వేరుగా ఉంటూ జీవనం సాగిస్తున్నారు. ఆదివారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిన వారిద్దరూ కనిపించకుండపోయారు. వ్యవసాయ బావి వద్ద చెప్పులు ఉండటం గుర్తించి బావిలో తేలుతున్న సరోజినమ్మ మృతదేహాన్ని స్థానికులు వెలికితీసారు. రాత్రంతా అదే బావిలో రామచంద్రయ్య మృతదేహం కోసం గాలించారు. ఉదయం వ్యవసాయ బావికి దగ్గరలోని ఓ చెట్టుకు ఉరి వేసుకుని ఉండటాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై రంజిత్ ఘటనా స్థలాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. ముగ్గురు కొడుకులు, కుమార్తె మృతదేహాల వద్ద కన్నీరుమున్నీరైన తీరు పలువురికి కంటతడి పెట్టించింది. వృద్ధ దంపతుల మృతదేహాలను భద్రాద్రి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు, మణుగూరు సొసైటీ అధ్యక్షుడు కుర్రి నాగేశ్వరరావు, నాయకులు వట్టం రాంబాబు, కుంట లక్ష్మణ్, ముద్దంగుల కృష్ణ, అక్కి నర్సింహారావు, పప్పుల ప్రసాద్, రావుల చంద్రయ్య సందర్శించి నివాళి అర్పించారు.

మొక్కలు నాటిన సింగరేణి సీఎండీ

మొక్క నాటుతున్న సీఎండీ

కొత్తగూడెం సింగరేణి, జూలై 29: సింగరేణి సీఎండీ బలరాం నాయక్, తన పుట్టిన రోజు సందర్భంగా హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో సోమవారం మొక్కలు నాటారు. అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

సహకార సంఘంలో వనమహోత్సవం

ఇల్లెందు రూరల్, జూలై 29: వన మహోత్సవంలో భాగంగా సోమవారం ఇల్లెందు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు మెట్టెల రామకృష్ణ, సెక్రటరీ గజేంద్రుల హరిప్రసాద్, సంఘం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కిన్నెరసాని పైప్‌లైన్ పరిశీలన

కొత్తగూడెం అర్బన్, జూలై 29: ఇటీవల పగిలిన కిన్నెరసాని పైప్‌లైన్‌ను సీపీఐకి చెందిన మున్సిపల్ కౌన్సిలర్లు సోమవారం పరిశీలించారు. మరమ్మతు పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను కోరారు. కోలాపురి ధర్మరాజు, మాచర్ల శ్రీను, బోయిన విజయ్, పోలోజు సత్యనారాయణాచారి, కందుకూరి ఈశ్వర్, మహ్మద్ యూసుఫ్ పాల్గొన్నారు.

డాక్టర్ పోస్టులను భర్తీ చేయాలి

ఆసుపత్రి వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

ఇల్లెందు రూరల్, జూలై 29: ఇల్లెందు ప్రభుత్వాసుపత్రిలో డాక్టర్, స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎం, జీఎన్ఎం పోస్టులను భర్తీ చేయాలని పీవైఎల్ రాష్ట్ర నాయకులు మోతీలాల్ డిమాండ్ చేశారు. సోమవారం ఇల్లెందు ప్రభుత్వాసుపత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

సుభాష్‌కు ఉత్తమ గ్రామీణ డాక్ సేవక్ అవార్డు

ఇల్లెందు రూరల్, జూలై 29: ఉత్తమ గ్రామీణ డాక్ సేవక్‌గా మండలానికి చెందిన కొమరారం బ్రాంచి పోస్టు మాస్టర్ అనుగోజు సుభాష్ అందుకున్నారు. సోమవారం హైదరాబాద్‌లో సర్కిల్ ఆఫీస్ లెవల్ (రాష్ట్రస్థాయిలో)ఉత్తమ గ్రామీణ డాక్ సేవక్ (పీవోఎస్‌బీ కేటగిరిలో) తెలంగాణ చీఫ్ పోస్టుమాస్టర్ జనరల్ డాక్టర్ పీవీఎస్ రెడ్డి చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకున్నారు.

కరకగూడెం, చర్ల మండలంలో వర్షం

చర్ల: పట్టణంలో కురుస్తున్న వర్షం

కరకగూడెం, జూలై 29: మండల వ్యాప్తంగా సోమవారం సాయంత్రం గంటపాటు కుండపోత వర్షం కురిసింది. వర్షం పత్తి పంటకు సైతం ఈ అనుకూలంగా మారారింది. చెరువులు జలకళను సంతరించుకుని నిండుకుండలా మారాయి. ఈ ఏడాది పంటలకు ఢోకాలేదని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

చర్ల, జూలై 29: సోమవారం రాత్రి చర్లలో భారీ వర్షం కురిసింది. సుమారు గంట సేపు కురిసిన వర్షానికి రోడ్లపై నుంచి వరదలు పారాయి. డ్రయినేజ్లు పొంగి రోడ్డపై నుంచి ప్రవహించాయి.

పిచ్చికుక్క స్వైర విహారం

ఇల్లెందు రూరల్, జూలై 29: పట్టణంలో పిచ్చి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. ఒంటరిగా మనుషులు, మహిళలు, పిల్లలు, విద్యార్థులు కనపడితే మీద పడి రక్కుతున్నాయి. ఎంతోమందిని తమ కాటేసిన సందర్భాలు కొకొల్లలుగా ఉన్నాయి. కాటుకు గురైతే రేబిస్ వ్యాధితో మృతిచెందడం ఖాయమని పలువురు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. శరీరమంతా రంగు తేలి పోయి భయంకరంగా కనపడుతున్నాయి. ఇప్పటికైనా మున్సిపాలిటీ సిబ్బంది స్పందించి పట్టణంలో ఉన్న పిచ్చికుక్కలను పట్టుకుని వదలాలని ప్రజలు కోరుతున్నారు.

బస్టాండ్‌లో ఫ్యాన్లు అలంకార ప్రాయమే..

బస్టాండ్‌లో తిరగని ఫ్యాన్లు

ఇల్లెందు రూరల్, జూలై 29: పట్టణంలోని కొత్తబస్టాండ్‌లో ఫ్యాన్లు ఉన్నా అలంకారప్రాయంగా మారాయి. ప్రయాణీకుల కోసం ఏర్పాటు చేసిన ఫ్యాన్లు తిరగకపోవడంతో ఆరుబయట తిరుగుతున్నారు. అధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. అదేవిధంగా బస్టాండ్‌కు బస్సులు కూడా సరైన సమయానికి రాకపోవడంతో ప్రయాణీకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

మాదకద్రవ్యాల నిర్మూలనే లక్ష్యం

మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్

కొత్తగూడెం క్రైం, జూలై 29: గంజాయి వంటి మాదక ద్రవ్యాలను నిర్మూలించడమే పోలీస్ శాఖ లక్ష్యమని త్రీ టౌన్ ఇన్‌స్పెక్టర్ కాగితోజు శివప్రసాద్ అన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలనపై సోమవారం హనుమాన్ బస్తీ, బూడిదగడ్డ ఏరియాలో త్రీ టౌన్ పోలీసులు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గంజాయి వంటి మాదక ద్రవ్యాల వల్ల జరిగే నష్టాలు, భవిష్యత్తులో ఎదురయ్యే సమస్యలను ప్రజలకు వివరించారు. కొత్తగూడెం రైల్వే స్టేషన్‌తోపాటు సమీప ప్రాంతాల్లో నార్కొటిక్స్ డిటెక్టర్ జాగిలాలతో తనిఖీలు నిర్వహించారు.

'ఆశ'ల అరెస్టుకు ఖండన

అరెస్టు అయిన ఆశా వర్కర్లు

కొత్తగూడెం అర్బన్, జూలై 29: తమ సమస్యలను పరిష్కరించాలన్న డిమాండుతో 'చలో హైదరాబాద్'కు సిద్ధమైన జిల్లాలోని ఆశ కార్యకర్తలను పోలీసులు ఎక్కడికక్కడ అరెస్ట్ చేశారని సీఐటీయూ ఆరోపించింది. ఈ మేరకు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బ్రహ్మాచారి, ఏజే రమేష్ ప్రకటన చేశారు. ఈ అరెస్టులను వారు ఖండించారు.

తపాలా కార్యాలయాల్లో మెరుగైన సేవలు

మాట్లాడుతున్న రంజిత్ కుమార్ చౌదరి

పాల్వంచ, జూలై 29: బ్యాంకులకంటే తపాలా కార్యాలయాల్లో ఎన్నెన్నో సేవలు అందుకోవచ్చని తపాలా శాఖ కొత్తగూడెం అసిస్టెంట్ సూపరింటెండెంట్ రంజిత్‌కుమార్ చౌదరి చెప్పారు. తపాలా సేవలపై స్థానిక మంచికంటి నగర్‌లో సోమవారం అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. తపాలా శాఖ అందిస్తున్న సేవలను వివరించారు. తపాలా జీవిత బీమాకు బోనస్ అధికంగా వస్తుందని చెప్పారు సుకన్య సమృద్ధి యోజనతో ఎంతో ప్రయోజనం ఉంటుందని చెప్పారు.

డోజర్ సీజ్

జూలూరుపాడు, జూలై 29: అడవిలో చెట్లను తొలగించిన డోజర్‌ను స్థానిక అటవీ శాఖాధికారులు సోమవారం సీజ్ చేశారు. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ప్రసాదరావు తెలిపిన వివరాలు.. మండలంలోని వినోభానగర్ గ్రామస్తుడు బాలకృష్ణ, అదే గ్రామంలోని బాదావత్ సురేష్‌కు చెందిన ట్రాక్టర్ డోజర్‌తో వినోభానగర్ ఫారెస్ట్ బీట్‌లోని చీమలపాడు రిజర్వ్‌ఫారెస్ట్‌లో చెట్లను సోమవారం తొలగించి చదును చేస్తున్నాడు. అటవీ సిబ్బంది అక్కడకు వెళ్లి డోజర్‌ను అడ్డుకున్నారు. దానిని అటవీశాఖ కార్యాలయానికి తరలించి సీజ్ చేశారు.

ఏఐటీయూసీ మండల మహాసభ

జూలూరుపాడు, జూలై 29: ఏఐటీయూసీ మండల 6వ మహాసభ స్థానిక ఏవీఆర్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం జరిగింది. జిల్లా గౌరవాధ్యక్షుడు ఎస్‌కే షాబీర్‌పాషా, అధ్యక్షుడు కంచర్ల జమలయ్య, కార్యదర్శి నరాటి ప్రసాద్, నాయకులు ఎర్రా బాబు, నరేంద్ర కుమార్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన

గొత్తికోయలతో మాట్లాడుతున్న ఆటవీ అధికారులు

జూలూరుపాడు, జూలై 29: అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా, వన్య ప్రాణుల సంరక్షణపై మండలంలోని ఏలకలొడ్డు గ్రామంలోని గొత్తికోయలకు అటవీ అధికారులు సోమవారం అవగాహన కల్పించారు. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ప్రసాదరావు, మల్లయ్య, హన్మంతు, విజయలక్ష్మి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

భద్రాద్రి రామయ్యకు ముత్తంగి అలంకరణ

భద్రాచలం, జూలై 29: భద్రాద్రి దివ్యక్షేత్రంలో సోమవారం అంతరాలయంలోని మూలవరులకు హైదరాబాద్‌కు చెందిన భక్తులు రూ.30లక్షలతో తయారు చేయించి సమర్పించిన ముత్యాలు పొదిగిన ప్రత్యేక తొడుగులను అర్చకులు ధరింపజేశారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామికి సుప్రభాతం పలికి ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్యహోమాలు, నిత్య బలిహరణం తదితర నిత్య పూజలను నిర్వహించారు. అనంతరం స్వామి వారి బేడా మండపంలో కల్యాణం జరిపారు.

బస్‌పాస్‌లను సద్వినియోగం చేసుకోవాలి

పాసులు అందజేస్తున్న డిపో మేనేజర్

టేకులపల్లి, జూలై 29: దివ్యాంగులు ఆర్టీసీ బస్ పాస్‌లను సద్వినియోగం చేసుకోవాలని కొత్తగూడెం డిపో మేనేజర్ ఎం దేవేందర్‌గౌడ్ అన్నారు. సోమవారం టేకులపల్లిలో దివ్యాంగుల కోసం ఆర్టీసీ బస్సు పాస్ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. తొలిరోజు 30మందికి పాసులు అందజేశారు. దివ్యాంగులు 9010374644కు కాల్ చేసి పాసులు తీసుకెళ్లాలన్నారు.

కార్గో సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ఆర్టీసీ కార్గో సేవలను వ్యాపారవేత్తలు, పారిశ్రామికవేత్తలు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కొత్తగూడెం డిపో మేనేజర్ ఎం దేవేందర్‌గౌడ్ అన్నారు. సోమవారం టేకులపల్లిలో ఆర్టీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్గో కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. అతి తక్కువ ఛార్జీతో భద్రంగా మీ పార్సిల్స్ గమ్యస్థానాలకు చేరవేయబడతాయని తెలిపారు.

ఎన్‌డీఆర్ఎఫ్ అవగాహన సదస్సు

అవగాహన కల్పిస్తున్న ఎన్‌డీఆర్ఎఫ్ బృందం

చర్ల, జూలై 29: ప్రకృతి వైపరీత్యాలు, వరదల సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, ప్రాణాపాయస్థితిలో, వివిధ సమయాల్లో గాయపడినవారిని రక్షించే పద్ధతిపై ఎన్‌డీఆర్ఎఫ్ బృందం ప్రజలకు అవగాహన కల్పించింది. సోమవారం చర్ల రైతువేదికలో ఏర్పాటుచేసిన అవగాహనా సదస్సులో ఎన్‌డీఆర్ఎఫ్ ఇన్‌స్పక్టర్ ప్రవీణ్‌కుమార్ ప్రజలకు అవగాహన కల్పించారు.

ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజం

భద్రాచలం, జూలై 29: ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమేనని, ఎక్కడా పనిచేసిన ప్రజల మన్ననలు పొందాలని భద్రాచలం జ్యూడిషియల్ ప్రథమశ్రేణి న్యాయమూర్తి ఎం వెంకటేశ్వర్లు అన్నారు. భద్రాచలం ప్రథమశ్రేణి న్యాయమూర్తి కోర్టులో ఏపీపీగా విధులు నిర్వహిస్తున్న సాంబ దుర్గాబాయి హనుమకొండ బదిలీ అవడంతో సోమవారం కోర్టు ఆవరణలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఏపీపీగా ఆమె నిర్వహించిన సేవలను కొనియాడారు.

వరద బాధితులకు శాశ్వత పరిష్కారం చూపాలి

భద్రాచలం, జూలై 29: వరద బాధితులకు శాశ్వత పరిష్కారం చూపాలని, డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేయాలని మహాజన మహిళా సమైఖ్య జిల్లా అధ్యక్షురాలు మేకల లత అన్నారు. సోమవారం ఆమె పట్టణంలోని నన్నపనేని మోహన్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాసకేంద్రాన్ని సందర్శించి అనంతరం మాట్లాడారు. వరదల వల్ల నష్టపోతున్న కుటుంబాలకు రూ.లక్ష ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

నేడు దివ్యాంగుల రాయితీ బస్‌పాస్ మేళా

మణుగూరు టౌన్, జూలై 29: ఆర్టీసీ మణుగూరు డిపో ఆధ్వర్యంలో మండలంలోని దివ్యాంగులకు మంగళవారం సురక్షాబస్టాండ్ వద్ద బస్‌పాస్ మేళ నిర్వహించనున్నట్లు డిపో మెనేజర్ కుదిరుపాక శ్యాంసుందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీలక్స్, ఎక్స్‌ప్రెస్ బస్సులతో పాటు పల్లెవెలుగు బస్సుల్లో 50శాతం రాయితీతో ప్రయాణించవచ్చని తెలిపారు.

వాహనాల తనిఖీ

మణుగూరు టౌన్, జూలై 29: మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో సోమవారం మణుగూరు పోలీసులు వాహనాలు తనిఖీలు చేశారు. ఎస్సై మేడ ప్రసాద్ పీవీ కాలనీ, బాంబేకాలనీతో పాటు పలు కూడళ్లలో వాహనాలు తనిఖీ చేసి అనుమాన్పద వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించారు. ధృవపత్రాలు లేని వారికి చలాన్లు విధించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య సిబ్బందికి సన్మానం

అశ్వారావుపేట టౌన్, జూలై 27: అశ్వారావుపేట పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, అశ్వారావుపేట-1 ఏఎన్ఎం చిలకమ్మ బదిలీ అయ్యారు. వీరిని గ్రామస్తులు, తోటి సిబ్బంది సోమవారం సన్మానించి వీడ్కోలు పలికారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

అశ్వారావుపేట రూరల్, జూలై 29: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. ఏలూరు జిల్లా బుట్టాయిగూడెం మండలం రేగులకుంట గ్రామానికి చెందిన తెల్లం మజ్ను(22), వేలేరుపాడులోని తన బంధువుల ఇంటి నుంచి సోమవారం బైక్‌పై తిరుగు ప్రయాణమయ్యాడు. మండలంలోని వినాయకపురం గ్రామంలోగల శివాలయం వద్ద గేదెలను ఈయన బైక్ ఢీకొంది. అతడు తీవ్ర గాయాలతో అక్కడక్కడే మృతి చెందాడు.

వరద బాధితులకు సాయం

అశ్వారావుపేట రూరల్, జూలై 29: మండలంలోని గుమ్మడవల్లి, కొత్తూరు గ్రామాల్లో వరద బాధితులకు కాంగ్రెస్ నాయకులు మొగళ్ల చెన్నకేశవరావు, జ్యేష్ట సత్యనారాయణ చౌదరి సోమవారం నిత్యావసరాలు పంపిణీ చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

భద్రాచలం, జూలై 29: పట్టణంలోని రామాలయం పరిసర ప్రాంతంలో సోమవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించింది. స్థానికులు మృతదేహాన్ని గుర్తించి, పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడు తెల్ల జుట్టు, తెల్ల గడ్డం కలిగి ఉన్నాడని, కాషాయరంగు దుస్తులు ధరించాడని, వయస్సు సుమారు 70ఏళ్లు ఉండవచ్చని ఎస్సై విజయలక్ష్మి తెలిపారు. స్థానికులను విచారించగా రామాలయం వద్ద భిక్షాటన చేస్తుంటాడని, గతంలో మల్లూరు గుట్ట వద్ద ఉండేవాడని తెలిపారన్నారు. ఈ వ్యక్తి గురించి ఎవరికైనా సమాచారం తెలిస్తే 8712682160 నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ